క్లుప్తంగా

వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం



అద్దేపల్లి(భట్టిప్రోలు): అద్దేపల్లిలోని శ్రీ రామ నామ క్షేత్రంలో శనివారం శ్రీరాముని పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కూరపాటి సుధాకరశాస్త్రి శాస్త్ర యుక్తంగా జరిపారు. సప్త రుషులతో పాదుకలకు అభిషేకం చేశారు. ఉదయం పట్టాభిరాముని నగరోత్సవం గావించారు. శ్రీఆంజనేయ సహస్ర నామ స్తోత్రం, గేయాలు ఆకట్టుకున్నాయి. మడమల రాంబాబు భాగవతార్ హరికథా కాలక్షేపమైంది. ఆత్మూరి మురళీ భజన కార్యక్రమం జరిగింది. గొర్రెల రాము, కృష్ణ బ్రదర్స్ బుర్ర కథ ఎంతగానో ఆకట్టుకుంది. అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు కాగిత దుర్గా ప్రసాదరావు, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు చీరల బహిరంగ వేలం



పిట్టలవానిపాలెం: చందోలులోని బగళాముఖి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 11 గంటలకు చీరల బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అమ్మవారికి కానుకలు, మొక్కుబడుల రూపంలో సమర్పించిన చీరలను ఆసక్తి కలిగిన భక్తులు వేలంలో పొందవచ్చని పేర్కొన్నారు. అలాగే పుష్య మాసం పురస్కరించుకుని మహాలక్ష్మి దేవిగా అమ్మవారిని అలంకరించి, పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె రూరల్: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఏఈ ఏడుకొండలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓల్డ్ టౌన్‌లోని జెండా చెట్టు మసీదు సెంటర్ నుంచి రింగ్ రోడ్డు సెంటర్ వరకు రోడ్డుకిరువైపులా, రింగ్ రోడ్డు సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్డుకు ఉత్తరం వైపు, నేతాజీ నగర్, ప్రభుత్వ ఆఫీసుల ప్రాంగణం, చిన్న మసీదు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు వెల్లటూరులో ఉచిత వైద్య శిబిరం

భట్టిప్రోలు: న్యూ లైఫ్ చిల్డ్రన్స్ హస్పిటల్ ఆధ్వర్యంలో పిల్లలకు ఉచిత వైద్య శిబిరం ఆదివారం ఉదయం 10 గంటలకు వెల్లటూరులో నిర్వహించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ రాజశేఖర్ కుప్పా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు రాధిక రాజశేఖర్ కుప్పా, కేటీఎస్ శ్రీనివాసరావు, అఖిల్ వైద్య సేవలు అందిస్తారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పెసర్లంకలో జనవరి పండగ

భట్టిప్రోలు: పెసర్లంకలో శనివారం జనవరి మాస పండగను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఐఆర్ఈఎఫ్ డైరెక్టర్ డాక్టర్ ఇమ్మానియేల్ రెబ్బా పాల్గొని గ్రామస్తులకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఇమ్మానియేల్‌కు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. అన్నదానం చేశారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

వేమూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలను పరిశీలించినట్లు ఎన్నికల సెక్టార్ అధికారి చొప్పర శేఖర్ తెలిపారు. చంపాడు, బూతుమల్లి, జంపని, పోతుమర్రు గ్రామాల్లోని పాఠశాలల్లో ఏర్పాటు చేసిన 11 ఎన్నికల పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించారు. ఎన్నికల కమిషన్‌కు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై నివేదిక పంపనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై పోలీసులు, సెక్టారు అధికారులు పర్యటించి, పరిశీలించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై దానయ్య పాల్గొన్నారు.

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం

వేజండ్ల(చేబ్రోలు): మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన చేబ్రోలు మండలం వేజండ్లలో శనివారం జరిగింది. దళితవాడకు చెందిన వేజండ్ల కరుణమ్మ కొద్ది రోజులుగా కుటుంబసమస్యలతో సతమతమవుతోంది. శనివారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. బంధువులు గమనించి 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మన కోసం యుద్ధం చేస్తున్న సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు
- భట్టిప్రోలు, కొల్లూరు కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం



భట్టిప్రోలు సమావేశంలో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న సమన్వయకర్త అశోక్‌బాబు

భట్టిప్రోలు: 'మన కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి యుద్ధం చేస్తున్నారు. ఆయన కోసం మనమంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.' అని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో మండల పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం పట్టణ అధ్యక్షుడు కుందేటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడారు. మండలంలో పార్టీని బలంగా ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ భేదాలు పక్కన పెట్టి పనిచేయాలని కోరారు. పార్టీలో అంతర్గత ఇబ్బందులుంటే చర్చించుకుని సరి చేసుకుందామని చెప్పారు. ఒక కుటుంబంలా పని చేసి, వేమూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. ఎన్నికలయ్యేంత వరకు ఒక మాట, ఎన్నికలైన తర్వాత మరొక మాట మాట్లాడే తత్వం తనది కాదని వరికూటి స్పష్టం చేశారు. అందరిని కలుపుకుని పోయేందుకు కృషి చేస్తానని పార్టీ శ్రేణులకు హామీ ఇచ్చారు. ఏ చిన్న సమస్య ఉన్నా తను ఉన్నాననే విషయాన్ని మరచి పోవద్దన్నారు. గ్రామాల వారీగా పార్టీ కార్యకర్తలను, నాయకులను, అభిమానులను అశోక్‌బాబు పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకటలలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీమ్, అగ్నికుల క్షత్రియ, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్లు శేరు శ్రీనివాసరావు, పడమట శ్రీనివాసరావు, వైఎస్సార్ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), పీఏసీఎస్ చైర్‌పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో 8వ తరగతి విద్యార్థులకు శనివారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు చందలూరి రామకోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అశోక్ బాబు పాల్గొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దినట్లు చెప్పారు. విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ఎంఈఓ నీలం దేవరాజ్ మాట్లాడుతూ.. రూ.12 కోట్ల వ్యయంతో మండలంలో 415 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందించినట్లు తెలిపారు. పాఠశాల పూర్వ విద్యార్థి సైకం నాగరాజు స్థానిక పీఎస్‌లో రైటర్‌గా ఉత్తమ సేవలకు రిపబ్లిక్ డే సందర్భంగా అవార్డు అందుకోవడంతో అతనిని అభినందించారు.

సమన్వయంతో పార్టీ పటిష్టం

కొల్లూరు : కొల్లూరు శివారు గాంధీ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన వైఎస్సార్ సీపీ శ్రేణుల మండల విస్తృత స్థాయి సమావేశంలో వైఎస్సార్ సీపీ వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు పాల్గొన్నారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయంగా కలసి నడిస్తేనే ఏ నాయకుడైనా సమాజంలో సరైన గుర్తింపు, ప్రాధాన్యం పెరుగుతాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుంటేనే పార్టీ మరింత పటిష్టవంతం అవుతుందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. రాజకీయంగా వెనుకబడిన సామాజిక వర్గాల్లోని వ్యక్తులను గుర్తించి, వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ద్వారా వైఎస్సార్ సీపీని పటిష్టంగా తయారు చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండల కార్యకర్తల సమావేశాలు ముగిసిన అనంతరం ప్రతి రోజు ఒక్కో గ్రామంలో తాను పర్యటించి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో జరిపిన అకృత్యాలు, అన్యాయాలను ప్రజల్లోకి ముక్త కంఠంతో తీసుకువెళ్లాలని సూచించారు. పేద వర్గాల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రతి ఒక్కరూ అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యకర్తలకు, నాయకులకు అన్యాయం జరిగితే తాను సహించే పరిస్థితి ఉండదన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వేమూరు మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉప్పు శిరీష, కొల్లూరు వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు బుల్లా నవరత్నం, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజి, మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ అయిల సుబ్బారావు, మాజీ ఎంపీపీ పెరికల పద్మారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

ఆహ్వానించిన ఎంపీ మోపిదేవి



టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ మోపిదేవి

రేపల్లె రూరల్: పట్టణంలోని 2, 26వ వార్డులకు చెందిన షేక్ శేషార్, షేక్ జాన్ సైదులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరిని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తన క్యాంప్ కార్యాలయంలో శనివారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని 24వ వార్డు, పోటుమెరక గ్రామాల్లో నిర్వహించనున్న జనవరి పండుగ కార్యక్రమాలకు ఎంపీ మోపిదేవి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున రూ.20వేల ఆర్థిక సాయం అందజేశారు. పండగను వైభవంగా జరుపుకోవాలని కోరారు.

జిల్లా రవాణా శాఖాధికారికి సన్మానం



బాపట్లటౌన్: జిల్లా రవాణా శాఖాధికారిగా విధులు నిర్వర్తిస్తున్న ఎ.చంద్రశేఖర్‌రెడ్డిని శ్రీకాకుళం జిల్లా ఉప రవాణా కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దానిలో భాగంగా శనివారం బదిలీపై వెళ్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని సిబ్బంది ఘనంగా సత్కరించారు. బాపట్ల జిల్లా ఇన్‌చార్జి రవాణాశాఖాధికారిగా కె. ప్రసాదరావును నియమించారు.

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

డీటీసీ షేక్ కరీం



వాక్‌థాన్‌లో పాల్గొన్న డీటీసీ కరీం, డీఎస్పీ బాలసుందరరావు తదితరులు

పట్నంబజారు: రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని డీటీసీ షేక్ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు చెప్పారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ నుంచి మూడు బొమ్మల సెంటర్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ షేక్ కరీం మాట్లాడుతూ కారు డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు పెట్టుకోవటంతో పాటు, పూర్తిస్థాయి నిబంధనలు పాటించాలని సూచించారు. వాహనంతో రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరూ కచ్చితంగా సంబంధిత ధ్రువీకరణ పత్రాలు వారి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం. బాలసుందరరావు మాట్లాడుతూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలకు ఆస్కారం ఇచ్చిన వారమవుతామని చెప్పారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్టీఏ అధికారులు జి. గోపాల్, టి. రాఘవరావు, మల్లీశ్వరి, సౌజన్య, సంధ్య, మధుసూదనరావు పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి

గుంటూరు ఈస్ట్: భార్యపై భర్తతో పాటు అతడి కుటుంబ సభ్యులు కలసి దిశ పోలీసుస్టేషన్ వెలుపల దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఫయాజ్‌ఖాన్ అతని భార్య నిహా పర్వీన్ గొడవ పడి విడిపోయారు. శనివారం ఇద్దరూ కుటుంబ సభ్యులతో కలసి దిశ పోలీసుస్టేషన్‌కు హాజరయ్యారు. ఆ తర్వాత స్టేషన్ నుంచి బయటకురాగానే ఫయాజ్‌ఖాన్ అతని కుటుంబ సభ్యులు నిహా పర్వీన్‌పై దాడి చేసి కొట్టారు. ఫిర్యాదు మేరకు పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె బకాయి అడిగినందుకు యజమానిపై..

అద్దె బకాయి అడిగినందుకు ఓ వ్యక్తి అతని కుటుంబ సభ్యులు ఇంటి యజమానిపై దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. భవానీపురంలో నివసించే కె.లావణ్య తన ఇంటిని మణికంఠ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చింది. అతడు మూడు నెలలుగా అద్దె చెల్లించడం లేదు. శనివారం లావణ్య ఇంటికి వెళ్లి అద్దె చెల్లించాల్సిందిగా అడిగింది. మాటామాట పెరిగి మణికంఠ, అతని కుటుంబ సభ్యులు లావణ్యపై దాడి చేసి కొట్టారు. ఈ మేరకు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం కోయవారిపాలెంలో రామినేని శ్యాంబాబు అక్రమంగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారం పోలీసులకు శనివారం అందింది. దీంతో హెడ్ కానిస్టేబుల్ బ్రహ్మ నాయుడు అతడ్ని అదుపులోకి తీసుకుని, ఐదు మద్యం సీసాల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.



కబడ్డీ విజేత.. కొల్లూరు మహిళల జట్టు



కబడ్డీ విజేత.. కొల్లూరు పురుషుల జట్టు

ఓ పట్టు పట్టారు..

- రసవత్తరంగా 'ఆడుదాం ఆంధ్రా' కబడ్డీ పోటీలు
- నియోజకవర్గ స్థాయి విజేతలుగా కొల్లూరు జట్లు

కొల్లూరు: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఆద్యంతం రసవత్తరంగా జరుగుతున్నాయి. శనివారం కొల్లూరు బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో వేమూరు నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఐదు మండలాల నుంచి పురుషుల, మహిళల జట్లు గెలుపు కోసం తుది వరకు పోరాడాయి. కొల్లూరు పురుషులు, మహిళా జట్లు విజేతలుగా నిలిచాయి. పురుషుల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో చుండూరు, భట్టిప్రోలు జట్లు నిలవగా, మహిళల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో భట్టిప్రోలు, చుండూరు జట్లు నిలిచాయి. ఆటల పోటీల ఇన్‌చార్జి గోపాలరెడ్డి, పీఈటీలు పెదపూడి నాగేశ్వరరావు, రవిరాజ, విజయలక్ష్మి, సురేంద్ర, రాజేష్, శ్రీనివాస రెడ్డి పర్యవేక్షించారు.

ఆట మధ్యలో కొట్లాట..

కబడ్డీ పోటీలు జరుగుతున్న క్రమంలో భట్టిప్రోలు, వేమూరు క్రీడాకారులు కొట్టుకున్నారు. ఈ ఘటనలో ఒక క్రీడాకారుడు గాయపడగా..అతని ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు క్రీడాకారులను బైండోవర్ చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... భట్టిప్రోలు ఆటగాడు కూతకెళ్లగా.. వేమూరు జట్టు సభ్యులు అతన్ని పట్టుకున్నారు. రిఫరీ వేమూరుకు పాయింట్ ఇచ్చాడు. ఈ క్రమంలో కూతకొచ్చిన ఆటగాడు వేమూరు జట్టులోని ఒకరి మెడపట్టుకుకోవడంతో.. వారు అతనిని కోర్టు బయట ఎత్తి పడేసి, దాడి చేశారు. ఇది గమనించిన భట్టిప్రోలు క్రీడాకారులు అక్కడికి వెళ్లడంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో వేమూరు జట్టు సభ్యుడు సోమరౌతు మహేష్ తలకు స్వల్పగాయమైంది. పీడీలు, స్థానికులు గొడవను సర్దు మణిచి.. కొల్లూరు పీహెచ్‌సీ సిబ్బంది సాయంతో గాయపడిన క్రీడాకారుడికి వైద్య సేవలు అందించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాజ్యలక్ష్మి ఘటనా ప్రాంతానికి చేరుకుని ఆటల పోటీలు యథాతథంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. గాయపడిన మహేష్ ఫిర్యాదు మేరకు భట్టిప్రోలు జట్టుకు చెందిన తిరుమలశెట్టి గోపికృష్ణ, కొమ్ము కళ్యాణ్, బండి సాయికిరణ్ లను బైండోవర్ చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.



కూతకొచ్చిన క్రీడాకారుడ్ని పట్టుకునే ప్రయత్నంలో ఆటగాళ్లు



తలపడుతున్న మహిళా క్రీడాకారిణులు

విద్యార్థులు సేవాతత్పరతను అలవరుచుకోవాలి



పారిశుద్ధ్య పనులు చేస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రేపల్లె రూరల్: విద్యార్థులు విద్యతో పాటు సేవా తత్పరతను అలవరుచుకోవాలని, సమాజ సేవలో తమ వంతు పాత్ర పోషించాలని ఐఆర్ఈఎఫ్ విద్యా సంస్థల డైరెక్టర్ బిషప్ డాక్టర్ ఇమ్మానుయేలు రెబ్బా అన్నారు. ఆర్‌సీ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్–1 ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి మండలంలోని బేతపూడి, మోర్లవారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను శనివారం ఆయన సందర్శించారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొనే విద్యార్థుల్లో స్నేహ తత్వం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. గ్రామాల్లో పచ్చదనం–పరిశుభ్రత పరిరక్షణ, పాల్‌థిన్ కవర్ల నష్టాలను వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 31వ తేదీ వరకు సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపల్ జాషువా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు దానియేలు, రణదీప్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా 5కే రన్



5కే రన్ ప్రారంభంలో విద్యార్థినులు

బాపట్ల అర్బన్: స్థానిక బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌సీసీ విద్యార్థినులు ఫిట్ ఇండియా 5కే రన్ శనివారం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ మానం నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ జి. శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు. ఏబీ సీటీఈ ఆదేశాల మేరకు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ యాజమాన్యం సహకారంతో అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ కెప్టెన్ ఒ. శ్రీదేవి ఆధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థినులు కళాశాల నుంచి మార్కెట్ యార్డ్ వరకు పరుగు నిర్వహించారు. ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీదేవి మాట్లాడుతూ.. మారుతున్న ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి వల్ల చాలా మంది చిన్న వయసులోనే గుండె, క్యాన్సర్ వ్యాధుల బారి పడుతున్నట్లు తెలిపారు. మరణాలు తగ్గించి, మంచి ఆరోగ్యం పొందాలంటే కొంత సమయం నడకకు కేటాయించాలని సూచించారు. వైస్ ప్రిన్సిపల్ ఐ.హరిత, విభాగాధిపతులు పాల్గొన్నారు.

బాధిత పసుపు రైతులను ఆదుకోవాలి



పెదలంకలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని

భట్టిప్రోలు: శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాద బాధిత పసుపు రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 29న దుగ్గిరాల పసుపు మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని ఏపీ పసుపు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం పెదపులివర్రు, పెసర్లంక, పెదలంక, చింతమోటు, కొల్లూరు మండలం కిష్కంధపాలెంలో బాధిత పసుపు రైతులను సదస్సుకు బృందం సభ్యులు ఆహ్వానించారు. పెదలంకలో సదస్సు కర పత్రాలను ఆవిష్కరించారు. రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.జమలయ్య, జిల్లా అధ్యక్షులు కె.రంగారెడ్డి, కౌలు రైతు సంఘం రేపల్లె ఏరియా కన్వీనర్ జి. బాలాజీ, రైతులు కె.సతీష్, కె. శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న మురళీమోహన్

భట్టిప్రోలు: వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు గుర్రం మురళీమోహన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గణతంత్ర దినోత్సవంలో భాగంగా గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కేవీఆర్ ట్రస్ట్ తరపున ఈ పురస్కారాన్ని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, స్కూల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ పార్వతి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వర ప్రసాద్ శుక్రవారం రాత్రి అందుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ సీపీఎస్ఈఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎంవీ కోటేశ్వరరావు, జిల్లా కోశాధికారి అంబటి జాకబ్ మురళీమోహన్‌ను అభినందించారు.

గుంటూరు కళా పరిషత్ నాటకోత్సవాలు ప్రారంభం



ఎనిమీ నాటికలోని సన్నివేశం

పాత గుంటూరు: రాజాగారితోటలోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గుంటూరు కళాపరిషత్ 26వ వార్షిక నాటక ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ సాహితీవేత్త బి. వేదయ్య కళావేదికపై నిర్వహించిన నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. పి.ఎస్. నారాయణ మూల కథ, పరమాత్ముని శివరాం నాటకీకరణ, రమేష్ మంచాల దర్శకత్వంలో కరీంనగర్ చైతన్య కళాభారతి కళాకారులు 'స్వప్నం రాల్చిన అమృతం' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కవి పీఎస్ఎం రచన, దర్శకత్వంలో ఇబ్రహీంపట్నం వీటీపీఎస్ కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'ఎనిమీ' సాంఘిక నాటిక ప్రదర్శించారు. కావూరి సత్యనారాయణ రచనకు, ఏపూరి హరిబాబు దర్శకత్వంలో గుంటూరు అమరావతి కల్చరల్ అసోసియేషన్ కళాకారులు 'అమృత హస్తం' సాంఘిక నాటిక ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. అనంతరం జరిగిన సభకు కళా పరిషత్ అధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ వి. రామలింగయ్య, పౌరాణిక రంగస్థల కళాకారులు నలకా శ్రీనివాసరావు, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి పూర్ణ, కార్యదర్శులు అమ్మిశెట్టి శివ, గుమ్మడి నాగేశ్వరరావు, సభ్యులు పాల్గొని కళాకారుల్ని సత్కరించారు.

రెండు రోజుల పాటు కాచి చల్లార్చిన నీరు తాగాలి

నెహ్రూనగర్: నగరానికి ప్రధాన నీటి వనరైన ప్రకాశం బ్యారేజీకి పులిచింతల నుంచి వస్తున్న నీటి సాంద్రత అధికంగా ఉందని, దీని వలన నగరపాలక సంస్థ ఫిల్టర్ రేషన్ పాయింట్స్ తగినంత నీటిని ఫిల్టర్ చేయలేకపోతున్నాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బ్యారేజీలో ముడి నీటి సాంద్రత అధికంగా మరో రెండు రోజులు ఉండే అవకాశం ఉందని, నగరంలో నీటి కొరత లేకుండా స్పెషల్ యాక్షన్ ప్లాన్ తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. ఉండవల్లి, తక్కెళ్లపాడు పంపింగ్ కేంద్రాల వద్ద వాటర్ సప్లై ఏఈ, డీఈఈలు ఆలం, క్లోరిన్ తగుపాళ్లలో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. రిజర్వాయర్ల వద్ద కూడా సంబంధిత ఏఈ, డీఈఈలు తాగునీటిలో 2 పీపీఎం క్లోరిన్ ఉండేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ సూచించారు. సచివాలయం పరిధిలో తాగునీటి సరఫరా జరిగే సమయంలో ఎమినిటీ కార్యదర్శులు క్లోరిన్ శాంపిల్స్ పరిశీలించాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో నగర ప్రజలు రెండు రోజులు పాటు కాచి చల్లార్చి తాగాలని, ఫిల్టరేషన్ సమస్య వల్ల ఏదైనా ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినా సహకరించాలని ఆమె కోరారు.

వృద్ధుడికి అరుదైన ఆపరేషన్

గుంటూరు మెడికల్: రెండు మోకాళ్లలో తీవ్రమైన నొప్పులతో 15 సంవత్సరాలుగా బాధపడుతున్న 70 ఏళ్ల వృద్ధుడికి అరుదైన, క్లిష్టమైన ఆపరేషన్ చేసి నొప్పి మాయం చేశామని శ్రీరామచంద్ర జాయింట్ రీ ప్లేస్‌మెంట్ సెంటర్‌కు చెందిన సర్జన్ డాక్టర్ పోట్ల శనివారం జరిగినవిలేకరుల సమావేశంలో ఆపరేషన్ వివరాలను వెల్లడించారు. బాపట్ల జిల్లా కొలగానివారిపాలేనికి చెందిన 70 ఏళ్ల దాడి వెంకటేశ్వర్లు కుడి మోకాలు లోపల 40 డిగ్రీలు, ఎడమ మోకాలు 50 డిగ్రీలు వెలుపలకు వంగిపోయి ఉన్నట్లు వెల్లడించారు. వైద్య పరిభాషలో ఈ వ్యాధిని 'విండ్ స్వెప్ట్ డిఫార్మిటీ' అంటారన్నారు. పలువురు వైద్యులను కలిసినా నొప్పి తగ్గక, తమ ఆస్పత్రికి 2023 నవంబర్‌లో వచ్చినట్లు చెప్పారు. పరీక్షలు చేసి, నవంబర్ 27 కుడి మోకీలు మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామన్నారు. మరలా 2024 జనవరి 23న అమెరికా నుంచి ప్రత్యేకంగా దిగుమతి చేసుకున్న ఇంప్లాంట్స్‌తో ఎడమ మోకీలుకు సుమారు ఐదు గంటల సేపు ఆపరేషన్ చేసి నొప్పి, ఒంకర, ఇతర సమస్యలు లేకుండా చేశామని వివరించారు.శనివారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు.